కెనరా బ్యాంకు సేవలు మెరుగుపరచాలని ఎమ్మార్పీఎస్ వినతి

యాడికి జనవరి 12 (అనంత ప్రభ)
యాడికి మండల కేంద్రంలోని కెనరా బ్యాంక్ పక్కన ఉన్న కెనరా ఏటీఎం కొంతకాలంగా పనిచేయకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షులు పాతకుట్ల బాలు మాదిగ అన్నారు. అత్యవసర నగదు అవసరాల కోసం బ్యాంక్ బ్రాంచ్‌కే రావాల్సి వస్తోందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. బ్యాంక్ బ్రాంచ్‌లో నగదు జమ, ఉపసంహరణలకు వేర–ువేరు కౌంటర్లు ఏర్పాటు చేయాలని, రైతులకు వ్యవసాయ రుణాల మంజూరు మరియు రెన్యువల్ ప్రక్రియల కోసం ప్రత్యేక కౌంటర్ ఏర్పాటు చేయాలని ఆయన కోరారు. దీంతో ప్రజలు, రైతులు అనవసరంగా వేచిచూడకుండా సౌకర్యంగా సేవలు పొందే అవకాశం ఉంటుందని తెలిపారు. ఈ సమస్యలను పరిగణనలోకి తీసుకుని తక్షణమే బ్యాంకు సేవలను మెరుగుపరిచే దిశగా చర్యలు చేపట్టాలని సంబంధిత ఉన్నతాధికారులకు నివేదించాలని కెనరా బ్యాంక్ మేనేజర్ శ్రీకాంత్ రెడ్డికి ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు బాలు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో చిరంజీవి, సూరి తదితరులు పాల్గొన్నారు

జ్వరం కేసులకు తప్పనిసరి రక్త పరీక్షలు

యాడికి జనవరి 12 (అనంత ప్రభ)
జిల్లా మలేరియా అధికారి డి. ఓబులు ఆదేశాల మేరకు చుక్కలూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం మెడికల్ ఆఫీసర్ డాక్టర్ లావణ్య ఆధ్వర్యంలో తాడిపత్రి మలేరియా సబ్ యూనిట్ ఆఫీసర్ శ్రీనివాసులు చుక్కలూరు ల్యాబ్‌ను పరిశీలించారు. ల్యాబ్ రికార్డులు సక్రమంగా నిర్వహించాలని ల్యాబ్ టెక్నీషియన్ నాగజ్యోతికి సూచించారు. జ్వరం వచ్చిన ప్రతి ఒక్కరికీ డెంగ్యూ, మలేరియా, చికెన్ గునియా, టైఫాయిడ్ రక్త పరీక్షలు తప్పనిసరిగా చేయాలని తెలిపారు. అదేవిధంగా యాడికి పిహెచ్‌సీ పరిధిలోని నిట్టూరు సచివాలయంలో ఫ్యామిలీ కాన్సెప్ట్ ప్రోగ్రామ్‌లో పాల్గొని గ్రామస్తులకు వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. ప్రైడే డ్రైడే ను ఖచ్చితంగా పాటించాలని సూచిస్తూ ఇంటింటి ఫీవర్ సర్వే నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వైద్యులు, ఆరోగ్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు

శ్రీ వివేకానంద హైస్కూల్‌లో జాతీయ యువజన దినోత్సవము

యాడికి, జనవరి 12 (అనంత ప్రభ)
యాడికి మండల కేంద్రంలోని శ్రీ వివేకానంద హైస్కూల్‌లో స్వామి వివేకానంద 163వ జయంతి మరియు జాతీయ యువజన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల ఆవరణలో ఏర్పాటు చేసిన స్వామి వివేకానందుని చిత్రపటానికి పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ముఖ్య అతిథులు పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. అనంతరం నిర్వహించిన సమావేశంలో ప్రధానోపాధ్యాయులు మాట్లాడుతూ లేవండి మేల్కొనండి గమ్యం చేరే వరకు విశ్రమించకండి అనే స్వామి వివేకానందుని సందేశం నేటి యువతకు నిరంతరం స్ఫూర్తినిస్తుందని పేర్కొన్నారు. భారతదేశ ఆధ్యాత్మిక శక్తి, సంస్కృతి, సంప్రదాయాల గొప్పతనాన్ని ప్రపంచ దేశాలకు చాటి చెప్పిన మహనీయుడు స్వామి వివేకానంద అని కొనియాడారు. విద్యార్థులు ఆయన అడుగుజాడల్లో నడుచుకుంటూ క్రమశిక్షణ, ఆత్మవిశ్వాసం, సేవాభావంతో కూడిన జీవితాన్ని గడపాలని సూచించారు. లక్ష్య సాధనలో పట్టుదల, శ్రమ, నైతిక విలువలు ఎంతో ముఖ్యమని, ఇవే యువతను విజయపథంలో నడిపిస్తాయని అన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు

యాడికిలో నేడు సంక్రాంతి హరితలక్ష్మి ముగ్గుల పోటీలు

యాడికి, జనవరి 12 (అనంత ప్రభ)
సంక్రాంతి పండుగ సంబరాల్లో భాగంగా జెసి ఫ్యామిలీ ఆధ్వర్యంలో యాడికి మండల కేంద్రంలోని శ్రీ లక్ష్మీ చెన్నకేశవ స్వామి ఆలయ సమీపమున నేటి ఉదయం ముగ్గుల పోటీలను నిర్వహిస్తున్నట్లు టిడిపి నాయకులు తెలిపారు. ఈ పోటీల్లో మంచి ప్రతిభ కనబరిచిన 17 మందికి విలువైన బహుమతులు అందజేస్తున్నట్లు, మిగిలిన వారికి కూడా కన్సలేషన్ బహుమతులు ఇవ్వడం జరుగుతుందని నిర్వాహకులు తెలిపారు. ఈ సంక్రాంతి హరిత ముగ్గుల పోటీలకు తాడిపత్రి మున్సిపల్ చైర్మన్ జెసి ప్రభాకర్ రెడ్డి, తాడిపత్రి ఎమ్మెల్యే జెసి అస్మిత్ రెడ్డి, తాడపత్రి మార్కెట్ యార్డ్ చైర్మన్ భూమి నాగ రాగిణిని ఈ ముగ్గుల పోటీలకు ఆహ్వానించామని తెలిపారు

యాడికిలో నేడు సంక్రాంతి హరితలక్ష్మి ముగ్గుల పోటీలు

పుట్టపర్తి, జనవరి 12 (అనంత ప్రభ)
సత్యసాయి జిల్లా ఉమ్మడి అనంతపురం జిల్లా వైయస్సార్ సీపీ సంస్థాగత వ్యవస్థ నిర్మాణం, రానున్న రోజుల్లో చేపట్టాల్సిన కార్యక్రమాలపై పుట్టపర్తిలో ఏర్పాటు చేసిన సమావేశానికి హాజరైన ఉమ్మడి అనంతపురం జిల్లా రీజినల్ కో ఆర్డినేటర్, రాజంపేట ఎంపీ శ్రీ మిథున్ రెడ్డి ,జిల్లా అధ్యక్షులు అనంత వెంకటరామారెడ్డి ,నియోజకవర్గ అబ్జర్వర్ తిప్పేస్వామి ,గుంతకల్ నియోజకవర్గ సమన్వయకర్త వై.వెంకటరామరెడ్డి, జింకాల రామాంజినేయులు,హాజరైన 14 అసెంబ్లీ నియోజకవర్గాల సమన్వయకర్తలు, జిల్లా కమిటీ నాయకులు, కార్యకర్తలు.అభిమానులు సంఘాల నాయకులతో సమావేశంలో పాలుగోన్నారు.

ప్రభుత్వ మద్దతు ధరతో కంది కొనుగోలు కేంద్రము

యాడికి, జనవరి 12(అనంత ప్రభ)
యాడికి మండలంలోని వేములపాడు సొసైటీలో రైతులకు లబ్ధి చేకూర్చే విధంగా ప్రభుత్వ మద్దతు ధరకు కంది కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. వేములపాడు సొసైటీ అధ్యక్షులు నాగమునిరెడ్డి అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమములో యాడికి మాజీ ఎంపీపీ వేలూరు రంగయ్య, టిడిపి మండల కన్వీనర్ దడియాల ఆది పాల్గొన్నారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ రైతులు ఎంతో కష్టపడి పండించిన పంటలు దళారుల చేతుల్లో తక్కువ ధరలకు అమ్ముకోవాల్సిన పరిస్థితి ఇకపై ఉండదని పేర్కొన్నారు. ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధరకు నేరుగా కొనుగోలు చేయడం వల్ల రైతులకు గిట్టుబాటు ధర లభించి, వారి ఆర్థిక స్థితి మరింత బలోపేతం అవుతుందని తెలిపారు. రైతులు ముందుగా రైతు సేవా కేంద్రంలో తమ వివరాలను ఆన్లైన్‌లో నమోదు చేసుకోవడం తప్పనిసరిగా ఉండాలని, ఆ తర్వాత మాత్రమే సొసైటీ ద్వారా కందులను విక్రయించుకోవచ్చని, కందులను విక్రయించిన 10 రోజులలోపు రైతుల బ్యాంకు ఖాతాల్లో ప్రభుత్వము నేరుగా డబ్బు జమ చేయడం జరుగుతుందని యాడికి మండల వ్యవసాయ అధికారి మహబూబ్ బాషా తెలిపారు. ప్రభుత్వం కందికి క్వింటాలుకు రూ.8,000 మద్దతు ధరను నిర్ణయించడంతో రైతులు హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో సొసైటీ డైరెక్టర్లు, సొసైటీ అధికారులు, రైతులు పాల్గొన్నారు

నల్లచెర్లోపల్లిలో పోలీస్ గ్రామసభ్లో అసాంఘిక శక్తులపై ఉక్కుపాదం

ముదిగుబ్బ, జనవరి 12 (అనంత ప్రభ)
శ్రీ సత్యసాయి జిల్లా ఎస్పీ సతీష్ కుమార్ ఆదేశాలు, ధర్మవరం డీఎస్పీ హేమంత్ కుమార్ సూచనల మేరకు ముదిగుబ్బ మండలం నల్లచెర్లోపల్లి గ్రామంలో సోమవారం రాత్రి పోలీస్ గ్రామసభ నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ముదిగుబ్బ అప్‌గ్రేడ్ పోలీస్ స్టేషన్ సీఐ శివరాముడు ఆధ్వర్యంలో చేపట్టారు.
గ్రామసభకు ముందు సీఐ శివరాముడు తన సిబ్బందితో కలిసి గ్రామంలోని వీధుల్లో పర్యటించి గ్రామ పరిస్థితులను పరిశీలించారు. గ్రామస్తులతో ముఖాముఖి మాట్లాడి వారి సమస్యలను ఓర్పుగా విని తగిన సూచనలు చేశారు.
ఈ సందర్భంగా సీఐ శివరాముడు మాట్లాడుతూ గ్రామ పరిశుభ్రత ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు. రోడ్లపై మురికి నీటిని వదిలే వారిపై తొలుత హెచ్చరికలు ఇస్తామని, పునరావృతమైతే చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. గ్రామంలో శాంతి భద్రతలు పటిష్టంగా ఉండాలంటే ప్రజలు ఐకమత్యంతో ఉండాలని సూచించారు.
గ్రామంలోని ముఖ్య ప్రాంతాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని, అనుమానాస్పద వ్యక్తులు లేదా అక్రమ కార్యకలాపాలు కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు. అసాంఘిక కార్యకలాపాలు, అక్రమ రవాణాను ఎట్టి పరిస్థితుల్లోనూ సహించబోమని తెలిపారు.
సంక్రాంతి పండుగను దృష్టిలో ఉంచుకుని కోడిపందాలు, జూదాలాటలు, గంజాయి, అక్రమ మద్యం విక్రయం లేదా సేవనంపై ఏమాత్రం ఉపేక్ష ఉండదని హెచ్చరించారు. అసాంఘిక శక్తులు, రౌడీషీటర్లు తమ ప్రవర్తన మార్చుకోకపోతే కఠిన చర్యలు తప్పవని స్పష్టం చేశారు.
చట్టాన్ని ఎవ్వరూ తమ చేతుల్లోకి తీసుకోరాదని, తప్పు చేసిన వారెవరికీ మినహాయింపు ఉండదని తెలిపారు. ప్రజలు ప్రశాంతంగా, భద్రంగా జీవించడమే పోలీస్ శాఖ ప్రధాన లక్ష్యమని పేర్కొంటూ గ్రామంలో శాంతియుత వాతావరణం నెలకొల్పడంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని సీఐ శివరాముడు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ హరికృష్ణ, గ్రామ పెద్దలు, మహిళలు, గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు

రెవెన్యూ సేవల్లో వేగం, పారదర్శకత తప్పనిసరి
: జాయింట్ కలెక్టర్ ఎం. మౌర్య భరద్వాజ్

పుట్టపర్తి, జనవరి 12 (అనంత ప్రభ)
ప్రజలకు నేరుగా సంబంధించిన రెవెన్యూ సేవల్లో ఎలాంటి ఆలస్యం లేకుండా వేగంగా, పారదర్శకంగా పనిచేయాలని జాయింట్ కలెక్టర్ ఎం. మౌర్య భరద్వాజ్ పుట్టపర్తి రెవెన్యూ అధికారులను ఆదేశించారు.

సోమవారం రాత్రి పుట్టపర్తి జిల్లా కలెక్టరేట్‌లోని పీజీఆర్ఎస్ హాలులో పుట్టపర్తి రెవెన్యూ డివిజన్ పరిధిలోని రెవెన్యూ అధికారులు, సిబ్బందితో పిజిఆర్ఎస్, రెవెన్యూ క్లినిక్స్, పట్టాదారు పాస్ పుస్తకాల పంపిణీ, రెవిన్యూ రికార్డుల నిర్వహణ, రీ సర్వే, జాయింట్ ఎల్పిఎమ్స్, పౌర సరఫరాలు నిత్యవసర వస్తువుల పంపిణీ, దీపం గ్యాస్ పంపిణీ, తదితర వివిధ అంశాలపై సమీక్షా సమావేశం నిర్వహించారు.

ఈ సందర్భంగా జేసి మాట్లాడుతూ... ప్రభుత్వ పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ చేరేలా సమిష్టి బాధ్యతతో పనిచేయాలని, ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకోవడమే లక్ష్యంగా అధికారులు విధులు నిర్వహించాలన్నారు. పీజీఆర్ఎస్ ఫిర్యాదులు, రెవెన్యూ క్లినిక్స్ ద్వారా వచ్చిన దరఖాస్తులను నిర్ణీత గడువులో పరిష్కరించాల్సిన బాధ్యత అధికారులదేనని స్పష్టం చేశారు. ముఖ్యంగా పట్టాదారు పాస్ పుస్తకాల పంపిణీ ప్రక్రియను వేగవంతం చేయాలని, అర్హులైన రైతులందరికీ పాస్ పుస్తకాలు అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. అలాగే రెవెన్యూ రికార్డుల సక్రమ నిర్వహణ, రీ–సర్వే పనులు నాణ్యతతో పూర్తిచేయడం, జాయింట్ ఎల్పీఎంలకు సంబంధించిన అంశాలు పెండింగ్ లేకుండా పరిష్కరించాలని అన్నారు. భూ సంబంధిత సమస్యలు రైతులకు తీవ్ర ఇబ్బందులు కలిగిస–ుత్తన్న నేపథ్యంలో అధికారులు క్షేత్రస్థాయిలో మరింత అప్రమత్తంగా పనిచేయాలని సూచించారు. పౌర సరఫరాల శాఖ ద్వారా నిత్యావసర వస్తువుల పంపిణీ, దీపం పథకం కింద గ్యాస్ సిలిండర్ల పంపిణీ సజావుగా జరిగేలా పర్యవేక్షణ పెంచాలని, లబ్ధిదారులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని జాయింట్ కలెక్టర్ తెలిపారు.

జిల్లా పోలీస్ కార్యాలయంలో "ప్రజా సమస్యల పరిష్కార వేదిక

పుట్టపర్తి, జనవరి 12 (అనంత ప్రభ)
జిల్లా ఎస్పీ శ్రీ ఎస్ సతీష్ కుమార్ ఐపీఎస్ గారి ఆదేశాల మేరకు..
జిల్లా పోలీస్ కార్యాలయంలో "ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని నిర్వహించిన... జిల్లా అడిషనల్ ఎస్పి శ్రీమతి అంకిత సురాని ఐపీఎస్ గారు...
ఈరోజు(సోమవారం) జిల్లా పోలీస్ కార్యాలయంలో "ప్రజా సమస్యల పరిష్కార వేదిక" కార్యక్రమాన్ని జిల్లా అడిషనల్ ఎస్పి శ్రీమతి అంకిత సురాని ఐపీఎస్ గారు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా నలుమూలల నుంచి వచ్చిన ఫిర్యాదుదారుల నుండి అర్జీలను స్వీకరించి, అర్జీదారులతో ముఖాముఖి మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు.
వారి ఫిర్యాదులను క్షుణ్ణంగా పరిశీలించారు. కుటుంబ కలహాలు, సైబర్ మోసాలు, తల్లిదండ్రులు వేధింపులు, భర్త/అత్తారింటి వేధింపులు,భూ–ఆస్తి వివాదాలు, ఆన్లైన్ మోసం, సిటీల పేరుతో మోసం,ఇతర సమస్యలపై ఫిర్యాదుదారులు స్వేచ్ఛగా విన్నవించుకోగా, వారి సమస్యలపై సంబంధిత పోలీసు అధికారులతో స్వ–యంగా ఫోన్లో మాట్లాడి ఫిర్యాదు అంశాలను పరిశీలించి, వాటి పూర్వాపరాలను విచారణ చేసి, ఫిర్యాదు అంశాలు వాస్తవాలైనట్లయితే ఫిర్యాదుదారులకు న్యాయం చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మొత్తం 70,ఫిర్యాదులు అందాయి. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ గారితో పాటుగా , లీగల్ అడ్వైజర్ సాయినాథ్ రెడ్డి ఎస్బి సిఐ వెంకటేశ్వర్లు, డిటిఆర్బిసిఐ లక్ష్మీకాంత్ రెడ్డి మరియు సిబ్బంది పాల్గొన్నారు

కందుల కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించిన వ్యవసాయ అధికారులు, నాయకులు

ఆత్మకూరు, జనవరి 12 (అనంత ప్రభ)
ఆత్మకూరు మండల కేంద్రంలో లో రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీతమ్మ సూచన మేరకు ఆంధ్రప్రదేశ్ మార్కెటింగ్ వ్యవసాయ శాఖ అధికారులు, తెదేపా నాయకులు ఆత్మకూరు మండల కేంద్రంలో కందుల కొనుగోలు కేంద్రాన్ని సోమవారం రోజున ప్రారంభించారు. క్వింటా 8వేలు తో ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని, ఏవో విజయ్ కుమార్ తెలియజేశారు. ఈ కార్యక్రమం లో నాయకులు, మండల కన్వీనర్ బోయ శ్రీనివాసులు, నియోజకవర్గ అధికార ప్రతినిధి శశాంక్ చౌదరి, భారీ పరిశ్రమ డైరెక్టర్ వెంకట్ నారాయణ, మనరంజన్, కందుల ఓబులపతి, గ్రామ కమిటీ అధ్యక్షుడు ఏకాంత కార్తీక్ ఆ దెప్ప, గ్యాస్ సీను, ఓబుల్ పతి, తిక్క స్వామి, అగ్రికల్చర్ సిబ్బంది రైతులు పాల్గొన్నారు

శ్రీ శ్రీ కాలభైరవ స్వామి కి విశేష పూజా కార్యక్రమాల నిర్వహణ

కూడేరు, జనవరి 12 (అనంత ప్రభ)
కూడేరు మండల పరిధిలోని గొటుకూరు గ్రామంలో శివుని ప్రతిరూపంగా ఐదు శతాబ్దాల క్రితమే వెలసినటువంటి శ్రీశ్రీ కాలభైరవ స్వామి నాటి నుండి నేటి వరకు భక్తుల కోర్కెలు తీర్చే కొంగ బంగారం వెలుగొందుతున్నారు. శ్రీ కాలభైరవ స్వామి కి సోమవారం రోజున విశిష్టమైన దినం కావడంతో కాశీ పాలకొడైన స్వామీజీ గొటుకూరు గ్రామంలోని శ్రీ కాలభైరవ స్వామి కి సోమవారం ఉదయం 5 గంటల కు పాలాభిషేకం, పంచామృత అభిషేకం, అలంకరణ,అర్చన మహానైవేద్యం , మహామంగళహారతి, నిర్వహించారు. ఈ అభిషేకాలు, హెూమమల యందు భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని స్వామివారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

స్వామి వివేకానంద జీవితం నేటి యువతకు ఆదర్శం..

అనంతపురం, జనవరి 12 (అనంత ప్రభ)
వివేకానంద జయంతి కార్యక్రమాల్లో పాల్గొన్న ఎమ్మెల్యే దగ్గుపాటి
నగరంలోని టవర్ క్లాక్, హరిహర నగర్ లోని వివేకానంద పార్క్ లో వేడుకలు
వివేకానందుని విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించిన ఎమ్మెల్యే దగ్గుపాటి
కార్యక్రమంలో పాల్గొన్న టిడిపి, బిజెపి నాయకులు
యువతకు స్ఫూర్తినిచ్చే విధంగా వివేకానందుని జయంతిని జాతీయ యువజన దినోత్సవంగా నిర్వహిస్తున్నాం
ఆయన సూక్తులు నేతి తరానికి ఎంతో విలువైనవి..ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్

కర్నూలు జిల్లా స్థాయి సంస్థాగత నిర్మాణాన్ని మరింత పటిష్టం చేస్తున్న లక్ష్యం

ఆదోని, జనవరి 12 (అనంత ప్రభ)
వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ కర్నూలు జిల్లాస్థాయి సంస్థాగత నిర్మాణాన్ని మరింత పటిష్టం చెయ్యాలనే లక్ష్యంతో జిల్లా అధ్యక్షులు శ్రీ ఎస్.వి. మోహన్ రెడ్డి గారి అధ్యక్షతన సమావేశం నిర్వహించారు.
ఈ సందర్భంగా ఆదోని మాజీ ఎమ్మెల్యే శ్రీ వై. సాయి ప్రసాద్ రెడ్డి గారు మాట్లాడుతూ, పార్టీ రాష్ట్ర అధ్యక్షులు శ్రీ వైఎస్ జగన్మోహన్ రెడ్డి గారి ఆదేశాల మేరకు గ్రామస్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు కమిటీల నిర్మాణాన్ని వేగవంతం చేసి, డిజిటలైజేషను ద్వారా ప్రతీ కార్యకర్తకు గుర్తింపు కార్డు అందించడం లక్ష్యన్నారు.
సమావేశంలో జిల్లా, నియోజకవర్గాల స్థాయి నాయకులు ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు. రాబోయే రోజుల్లో పార్టీని గ్రామస్థాయిలో మరింత బలోపేతం చేసి,2029 ఎన్నికల్లో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీని తిరిగి అధికారంలోకి తీసుకోరావాలని పిలుపునిచ్చారు.

ఉద్యోగం కోసం ఆత్మప్తితో ఆదోని సాఫ్ట్వేర్ రూ 4 లక్షలు మోసం

కూడేరు, జనవరి 12 (అనంత ప్రభ)
ఆదోని కి చెందిన సాఫ్ట్వేర్ నాగరాజు హైదరాబాద్ మియాపూర్ కు చెందిన కొరటాని శివాపై ఆదోని ఎన్జీవోస్ కాలనీ నివాసి నాగరాజు సోమవారం డీఐజి, జిల్లా ఎస్పి విక్రాంత్ పటిల్ కు ఫిర్యాదు చేశారు, సాఫ్ట్వేర్ జాబ్ ఇప్పిస్తానని నమ్మించి మోసం చేసి రూ 4 లక్షలు వసూలు చేసి, జాబ్ ఆఫర్ లెటర్లు ఇచ్చి మోసం చేశాడని ఆదోని నాగరాజు ఆరోపించారు, ఈ విషయంపై కర్నూల్ పోలీసులు చట్టపరమైన విచారణ జరుపుతామని బాధితుడికి న్యాయం అందిస్తారని జిల్లా ఇంచార్జ్ ఎస్పి విక్రాంత్ పటిల్ తెలిపారు...